# సూపర్-8లో సఫారీలు

## 113 పరుగుల ఛేదనలో బంగ్లా బోల్తా • స్వల్ప స్కోర్ల పోరులో దక్షిణాఫ్రికాదే పైచేయి

**అదే ఉత్కంఠ! అదే మజా! బౌలర్లకు స్వర్గధామంగా మారి బ్యాటర్లకు చుక్కలు చూపిస్తున్న న్యూయార్క్ పిచ్‌పై భారత్-పాకిస్థాన్ మధ్య ఆదివారం ముగిసిన 'లో స్కోరింగ్ థ్రిల్లింగ్' మాదిరిగానే మరో ఉత్కంఠ పోరు క్రికెట్ అభిమానులను అలరించింది. దక్షిణాఫ్రికా-బంగ్లాదేశ్ మధ్య సోమవారం జరిగిన 'స్వల్ప స్కోర్ల సమరం'లో సఫారీలదే పైచేయి అయ్యింది. నసావు పిచ్‌పై భారీ హిట్టర్లు కలిగిన సౌతాఫ్రికా.. నిర్ణీత 20 ఓవర్లలో 113 పరుగులే చేసినా ఆ జట్టు దానిని విజయవంతంగా కాపాడుకుంది. బంతితో ఆకట్టుకున్న బంగ్లా.. బ్యాట్‌తో తడబడి 109 పరుగుల వద్దే ఆగిపోయి ఓటమిపాలైంది. ఈ విజయంతో సూపర్-8 దశకు అర్హత సాధించిన తొలి జట్టుగా దక్షిణాఫ్రికా నిలిచింది.**

న్యూయార్క్: కొద్దిగంటల క్రితమే భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన ఉత్కంఠ పోరును మరువక ముందే టీ20 వరల్డ్ కప్‌లో మరో 'లోయెస్ట్ స్కోరింగ్ థ్రిల్లర్' అభిమానులను కట్టిపడేసింది. న్యూయార్క్‌లోని నసావు స్టేడియం వేదికగా సౌతాఫ్రికా.. బంగ్లాదేశ్‌పై 4 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. తంజీమ్ హసన్ షకిబ్ (3/18), టస్కిన్ అహ్మద్ (2/19) ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 113 పరుగులు మాత్రమే చేయగలిగింది. హెన్రిచ్ క్లాసెన్ (44 బంతుల్లో 46, 2 ఫోర్లు, 3 సిక్సర్లు), డేవిడ్ మిల్లర్ (38 బంతుల్లో 29, 1 ఫోర్, 1 సిక్స్) ఆదుకోకుంటే సఫారీల పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. ఛేదనలో తడబడ్డ బంగ్లాదేశ్.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 109 పరుగులు చేసి విజయానికి 4 పరుగుల దూరంలో ఆగిపోయింది. తౌవిద్ హృదయ్ (34 బంతుల్లో 37, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), మహ్మదుల్లా (27 బంతుల్లో 20, 2 ఫోర్లు) పోరాడారు. క్లాసెన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### టాపార్డర్ వైఫల్యం

ప్రొటీస్ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ రీజా హెండ్రిక్స్‌ను తంజీమ్ హసన్ డకౌట్ చేసి బంగ్లాకు తొలి బ్రేక్ ఇచ్చాడు. 6, 4, 6తో జోరు మీదున్న డికాక్ (18)ను సైతం తంజీమ్ మూడో ఓవర్లో క్లీన్ బౌల్డ్ చేశాడు. నాలుగో ఓవర్‌లో టస్కిన్.. మార్క్‌రమ్ (4)ను బౌల్డ్ చేసి దక్షిణాఫ్రికా కష్టాలను రెట్టింపు చేయగా మరుసటి ఓవర్లో తంజీమ్.. ప్రమాదకర ట్రిస్టన్ స్టబ్స్ (0)ను పెవిలియన్‌కు పంపి ఆ జట్టును పీకల్లోతు కష్టాల్లోకి నెట్టాడు. 23 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన సౌతాఫ్రికాను క్లాసెన్-మిల్లర్ ఆదుకున్నారు. ఈ ఇద్దరూ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నా వేగంగా పరుగులు రాబట్టలేకపోయారు. బంగ్లా బౌలర్లు కట్టడితో సౌతాఫ్రికా ఎట్టకేలకు 17 ఓవర్లకు వంద పరుగుల మార్కును చేరింది. కానీ 18వ ఓవర్లో టస్కిన్.. క్లాసెన్‌ను బౌల్డ్ చేయడంతో 79 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాతి ఓవర్లోనే మిల్లర్ సైతం నిష్క్రమించాడు.

### ఒత్తిడికి చిత్తైన బంగ్లా

ఛేదనలో బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ సైతం తడబడింది. రెండో ఓవర్లోనే రబాడా.. తంజీద్ హసన్ (9)ను ఔట్ చేశాడు. ఏడో ఓవర్లో బౌలింగ్ మార్పుగా వచ్చిన కేశవ్ మహారాజ్.. లిటన్ దాస్ (9)ను పెవిలియన్‌కు పంపాడు. 8వ ఓవర్లో బంతిని అందుకున్న అన్రిచ్ నోకియా వరుస ఓవర్లలో షకిబ్ అల్ హసన్ (3), నజ్ముల్ హోసెన్ శాంటో (14)ను ఔట్ చేయడంతో బంగ్లా అభిమానుల్లో ఆందోళన నెలకొంది. కానీ యువ ఆటగాడు హృదయ్‌తో జతకలిసిన సీనియర్ బ్యాటర్ మహ్మదుల్లా ఆ జట్టును గట్టెక్కించే యత్నం చేశాడు. విజయానికి 20 పరుగుల దూరంలో రబాడా.. హృదయ్‌ను ఔట్ చేయడంతో బంగ్లా ఒత్తిడికి గురైంది. ఇదే అదనుగా ప్రొటీస్ బౌలర్లు, ఫీల్డర్లు తమ అనుభవన్నంతా రంగరించి బంగ్లాను కట్టడిచేశారు. 18వ ఓవర్లో రబాడా 2 పరుగులే ఇవ్వగా బర్ట్‌మన్ 19వ ఓవర్లో 7 రన్స్ ఇచ్చాడు. కేశవ్ మహారాజ్ వేసిన చివరి ఓవర్లో బంగ్లా విజయానికి 11 పరుగులు కావాల్సి ఉండగా మూడో బంతికి జేకర్ అలీ (8), బంగ్లా భారీ ఆశలు పెట్టుకున్న మహ్మదుల్లా భారీ షాట్ ఆడబోయి మార్క్‌రమ్‌కు చిక్కడంతో ఆ జట్టు ఓటమి ఖరారైంది.




**సంక్షిప్త స్కోర్లు:**

**దక్షిణాఫ్రికా:** 20 ఓవర్లలో 113/6 (క్లాసెన్ 46, మిల్లర్ 29, తంజీమ్ 3/18, టస్కిన్ 2/19).
**బంగ్లాదేశ్:** 20 ఓవర్లలో 109/7 (హృదయ్ 37, మహ్మదుల్లా 20, కేశవ్ 3/27, నోకియా 2/17)

## ముంబై క్రికెట్ చీఫ్ మృతి

**గుండెపోటుతో హఠన్మారణం**



ముంబై: ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) అధ్యక్షుడు అమోల్ కాలె సోమవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. ఆదివారం న్యూయార్క్‌లోని నసావు స్టేడియం వేదికగా అమోల్.. ఎంసీఏ ప్రతినిధులతో కలిసి భారత్-పాకిస్థాన్ మ్యాచ్ వీక్షించి హోటల్‌కు వెళ్లాక గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు తెలుస్తోంది. 47 ఏండ్ల అమోల్.. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు సన్నిహితుడు. 2022లో ఎంసీఏ ఎన్నికలలో భారత మాజీ క్రికెటర్ సందీప్ పాటిల్‌ను ఓడించి ఆ పగ్గాలు అందుకున్నాడు. ఎంసీఏ అధ్యక్ష హోదాలో అమోల్ పలు కీలక సంస్కరణలు తీసుకొచ్చాడు. రానున్న దేశవాళీ సీజన్‌లో రెడ్‌బాల్ క్రికెట్ ఆడే ప్లేయర్లందరికీ బీసీసీఐ నుంచి మ్యాచ్ ఫీజు దక్కేలా చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించాడు. అమోల్ ఆకస్మిక మరణం పట్ల భారత మాజీ క్రికెటర్ రవిశాస్త్రి సంతాపం ప్రకటించారు.

## గుల్వీర్‌సింగ్ నయా నేషనల్ రికార్డు



పోర్ట్‌లండ్: గతేడాది హాంగ్జౌ ఆసియా క్రీడల్లో కాంస్యం గెలిచిన భారత యువ అథ్లెట్ గుల్వీర్ సింగ్.. 5000 మీటర్ల రేసులో సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. అమెరికా వేదికగా జరుగుతున్న పోర్ట్‌లండ్ ట్రాక్ ఫెస్టివల్‌లో ఈ ఉత్తరప్రదేశ్ కుర్రాడు 13 నిమిషాల 18.32 సెకన్లలో పరుగును పూర్తి చేసి రెండో స్థానంలో నిలవడంతో పాటు నేషనల్ రికార్డునూ బ్రేక్ చేశాడు. గతంలో ఈ ఘనత అవినాశ్ సాబ్లె (13:19.30) పేరిట ఉండేది. పోర్ట్‌లండ్ ఈవెంట్‌లో అమెరికా అథ్లెట్ డైలన్ జాకబ్స్ (13:18.8) అగ్రస్థానం దక్కించుకోగా భారత్‌కు చెందిన కార్తీక్ కుమార్ 17వ స్థానంలో నిలిచాడు.

## సురభికి రజతం

**జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: సురేంద్రసింగ్ స్మారక జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ షూటర్ సురభి భరద్వాజ్ రజత పతకంతో మెరిసింది. భోపాల్ వేదికగా జరిగిన పోటీల్లో మహిళల 50మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో సురభి 621.8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అయితే రాజస్థాన్ షూటర్ మణిని కౌశిక్(621.9) పాయింట్లతో స్వర్ణం దక్కించుకోగా, కేవలం పాయింట్ తేడాతో సురభి పసిడి పతకాన్ని చేజార్చుకుంది. మరోవైపు మహిళల 50మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో సురభి 425.9 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి నిరాశ పరిచింది. ఈ విభాగంలో ప్రియ (461.4) విదర్శ (461.1), మాణిని (448.6) పతకాలు కైవసం చేసుకున్నారు.

## రాష్ట్ర హ్యాండ్‌బాల్ కోశాధికారిగా శివప్రకాష్



ఎల్బీనగర్, జూన్ 10: తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కోశాధికారిగా ఎల్బీనగర్‌కు చెందిన శివప్రకాష్ నియమితులయ్యారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఉన్న శివప్రకాష్‌ను రాష్ట్ర సంఘం కోశాధికారిగా నియమిస్తూ తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జగన్‌మోహన్‌రావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివప్రకాష్ మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ క్రీడ, అసోసియేషన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.



## ఎమ్ఎల్ఆర్ పసిడి జోరు

• **నేషనల్ మాస్టర్స్ గేమ్స్‌లో రెండు స్వర్ణాలు**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వయసు కేవలం సంఖ్య మాత్రమే అని మరోమారు రుజువు అయ్యింది. ఎనిమిది పదుల వయసులోనూ మర్రి లక్ష్మణ్‌రెడ్డి తనలో సత్తా తగ్గలేదని నిరూపిస్తున్నారు. నేషనల్ మాస్టర్స్ గేమ్స్‌లో హైదరాబాద్ మాస్టర్ స్విమ్మర్ లక్ష్మణ్‌రెడ్డి రెండు పసిడి పతకాలతో మెరిశారు. మాస్టర్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 80 వయసు విభాగం 100మీ బ్రెస్ట్ స్ట్రోక్ రేసును లక్ష్మణ్‌రెడ్డి 16.59 సెకన్లలో ముగించి అగ్రస్థానంలో నిలిచాడు. మరోవైపు 100మీ ఫ్రీ స్టయిల్‌లో 3నిమిషాల 32.50 సెకన్ల టైమింగ్‌తో మరో పసిడి పతకాన్ని ఖాతాలో వేసుకున్నారు.

## స్కాట్లాండ్ గెలుపు జోరు

నార్త్‌సౌండ్: టీ20 ప్రపంచకప్‌లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఒమన్ నిర్దేశించిన 151 పరుగుల లక్ష్యఛేదనలో ఒమన్ 13.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. బ్రాండన్ మెక్‌ముల్లెన్(31 బంతుల్లో 61 నాటౌట్, 9ఫోర్లు, 2సిక్సలు) ధనాధన్ అర్ధసెంచరీతో విజృంభించాడు. బిలాల్‌ఖాన్, ఇలియాస్, మెహ్రాన్ ఖాన్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు ప్రతీక్(54), అయాన్‌ఖాన్(41 నాటౌట్) బ్యాటింగ్‌తో ఒమన్ 150/7 స్కోరు చేసింది. మెక్‌ముల్లెన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

## నాగల్ @ 77

**కెరీర్ బెస్టు ర్యాంకుకు భారత టెన్నిస్ స్టార్**



ఢిల్లీ: భారత టెన్నిస్ యువ సంచలనం సుమిత్ నాగల్ కెరీర్ బెస్టు ర్యాంకు సాధించాడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) తాజాగా ప్రకటించిన ర్యాంకులలో నాగల్.. 18 స్థానాలు ఎగబాకి 713 ఏటీపీ పాయింట్లతో 77వ ర్యాంకుకు చేరాడు. ఆదివారం జర్మనీ వేదికగా ముగిసిన హీల్‌బ్రోన్ నెకర్‌కప్ చాలెంజర్ ఈవెంట్‌లో టైటిల్ నెగ్గడంతో నాగల్ ర్యాంకు మెరుగుపడింది. దీంతో అతడు రాబోయే పారిస్ ఒలింపిక్స్‌లో సింగిల్స్ విభాగంలో భారత్ తరపున పాల్గొనేందుకు కోటానూ దక్కించుకున్నట్టే. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్ నెగ్గిన ఇటలీ కుర్రాడు జానిక్ సిన్నర్.. నొవాక్ జొకోవిచ్‌ను వెనక్కినెట్టి అగ్రస్థానం దక్కించుకున్నాడు. 1973 నుంచి ఏటీపీ ర్యాంకులు మొదలవగా ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచిన తొలి ఇటలీ ప్లేయర్‌గా సిన్నర్ రికార్డులకెక్కాడు. అల్కారజ్ 2వ ర్యాంక్‌కు ఎగబాకగా తర్వాతి స్థానాల్లో జొకో, జ్వెరెవ్ ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో ఇగా స్వియాటెక్ నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతోంది.

## ఛెత్రి లేకుండా తొలి మ్యాచ్!

• **నేడు భారత్, ఖతార్ పోరు**



దోహా: సుమారు రెండు దశాబ్దాల పాటు భారత ఫుట్‌బాల్ జట్టుకు సేవలందించిన మాజీ సారథి సునీల్ ఛెత్రి లేకుండా 'బ్లూ టైగర్స్' కీలక పోరుకు సిద్ధమైంది. రాబోయే ఫిఫా వరల్డ్ కప్ అర్హత రౌండ్లలో భాగంగా మూడో రౌండ్‌కు ముందంజ వేయాలంటే భారత ఫుట్‌బాల్ జట్టుకు ఇదే చివరి అవకాశం! రెండో రౌండ్‌లో భారత్.. మంగళవారం దోహాలోని జాసిమ్ బిన్ హమాద్ స్టేడియం వేదికగా పటిష్ఠమైన ఖతార్‌తో తలపడనుంది. గ్రూప్-ఏలో 13 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా ఉన్న ఖతార్ ఇప్పటికే మూడో రౌండ్‌కు అర్హత సాధించగా రెండో స్థానంలో ఉన్న భారత్ ఖాతాలో అఫ్గానిస్థాన్, కువైట్‌తో కలిసి 5 పాయింట్లున్నాయి. ఈ మ్యాచ్‌లో ఖతార్‌ను ఓడిస్తేనే భారత్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ ఓడితే ఫిఫా క్వాలిఫయర్స్‌తో పాటు ఏఎఫ్‌సీ ఆసియా కప్ 2027 నుంచీ తప్పుకున్నట్టే! డ్రా చేసుకుంటే మంగళవారం జరిగే కువైట్-అఫ్గాన్ మ్యాచ్ ఫలితం కోసం వేచి చూడాల్సిందే.

**చిత్రం**



## అభిమానులకు బర్త్‌డే గిఫ్ట్స్

కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో బాలకృష్ణ నటిస్తున్న 'ఎన్బీకే 109' చిత్రం ఈ దసరాకి విడుదల చేయడానికి నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా కూడా బాలయ్య విజయపరంపరను కొనసాగించడం ఖాయమని అభిమానులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కారణంగా ఈ సినిమా షూటింగ్‌కి కాస్త విరామం ఇచ్చిన బాలయ్య.. మళ్లీ లొకేషన్‌లోకి అడుగుపెట్టనున్నారు. సోమవారం బాలకృష్ణ పుట్టినరోజు. 64ఏళ్లు నిండి 65లోకి అడుగుపెట్టారాయన. ఈ సందర్భంగా బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రత్యేక గ్లింప్స్‌ను నిర్మాతలు విడుదల చేశారు. బాలకృష్ణ పాత్రను పరిచయం చేస్తూ.. 'జాలి.. దయ.. కరుణ లాంటి పదాలకు అర్థం తెలియని అసురుడు' అంటూ ఓ పవర్‌ఫుల్ డైలాగ్‌ని రివీల్ చేశారు. ఈ గ్లింప్స్‌ను బట్టి ఇందులో బాలయ్య పాత్ర అత్యంత శక్తివంతంగా ఉండబోతున్నదని తెలుస్తున్నది.

### నాలుగో విజయంకోసం..



ఇదిలావుంటే.. ఈ పుట్టినరోజు సందర్భంలోనే అభిమానులు ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూస్తున్న బాలయ్య-బోయపాటి సినిమా ప్రకటన కూడా వచ్చేసింది. 'బీబీ4' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమాకు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మాతలు. బాలకృష్ణ రెండవ కుమార్తె తేజస్విని ఈ చిత్రానికి సమర్పకురాలు కావడం విశేషం. అయితే.. ఇది 'అఖండ2'నా?, లేక వేరే కథా? అనేది మాత్రం తెలియాల్సి వుంది.

## వాళ్ల అవస్థ చూస్తే నవ్వొచ్చింది



సోషల్ మీడియా ప్రభావం పెరిగాక వార్తలు ఎంత వేగంగా వ్యాపిస్తున్నాయో.. అంతకంటే వేగంగా పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రస్తుతం చేతిలో సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ జర్నలిస్టే. అలా అయిపోయింది సొసైటీ. ఈ విషయంపై ఇటీవల కత్రినాకైఫ్ స్పందించింది. 'లాస్ట్ మంత్ నా భర్త విక్కీ కౌశల్ పుట్టినరోజును సెలబ్రేట్ చేసుకునేందుకు లండన్ వెళ్లాం. అక్కడ కొన్ని ఫొటోలు దిగాం. ఫొటోగ్రాఫర్ తప్పిదం వల్ల ఆ ఫొటోల్లో నేను గర్భం దాల్చినట్టుగా కనిపించాను. ఇక ఆ ఫొటోలు పట్టుకొని నేను ప్రెగ్నెంట్ అయినట్టుగా వార్తలు రాసేశారు. మేం ఇండియా వస్తున్నామని తెలిసి, నా ఫొటోలకోసం వీరంతా ఎయిర్‌పోర్ట్ ముందు కెమెరాలతో రెడీగా ఉన్నారు. నేను మామూలుగా రావడంతో అందరూ షాక్ అయ్యారు. వాళ్ల అవస్థ చూస్తే నవ్వొచ్చింది. నా ప్రెగ్నెన్సీ గురించి వాళ్లకెందుకు? అది మా సొంత విషయం కదా.. దానివల్ల దేశానికి ఏమైనా ఉపయోగం ఉందా? వార్తలు ఎలా ఉండాలో తెలియని వాళ్లు వార్తలు రాసేస్తున్నారు. అక్కడే వస్తుంది ప్రాబ్లమ్ అంతా' అంటూ చెప్పుకొచ్చింది కత్రినా.



## మరో ప్రపంచం వస్తుంది

సోమవారం విడుదలైన 'కల్కి 2898' సినిమా ట్రైలర్ ద్వారా దర్శకుడు నాగ్‌అశ్విన్ మూడు నిమిషాల పాటు కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాడు. ట్రైలరే ఇలా ఉంటే ఇక సినిమా ఏ స్థాయిలో ఉంటుంది? అనే ప్రశ్న ఉత్పన్నమయ్యేలా ఈ ట్రైలర్ ఉంది. 'సృష్టిని కాపాడాలంటే.. ఆ తల్లి కడుపులో ఉన్న బిడ్డను కాపాడాలి' అంటూ అశ్వత్థామగా అమితాబ్ ప్రవర్తన ఆ ట్రైలర్‌లో చూడొచ్చు. ఇందులో నిండు చూలాలైన తల్లిగా దీపిక పదుకొనే కనిపించింది. ఆ తల్లి కడుపులో ఉన్న బిడ్డ ఎవరు? ఆ బిడ్డేనా 'కల్కి'?.. అంటే.. ఇందులో ప్రభాస్‌కి తల్లిగా దీపిక పదుకొనే నటించిందా? ఈ ప్రశ్నలన్నీ ఉత్పన్నమయ్యేలా ట్రైలర్ ఉంది. 'ఈ సృష్టిలో తొలి నగరం కాశీ.. చివరి నగరం కూడా కాశీనే' అని సృష్టి అంతం గురించి చెబుతూ పునరుజ్జీవాన్ని కూడా చూపించారు. 'ఆరువేల సంవత్సరాల క్రితం నాటి పవర్ మళ్లీ కనిపించింది.. అంటే ఇక వెలుగు వచ్చే సమయం ఆసన్నమైంది..' అని రాజేంద్రప్రసాద్ పాత్ర చెప్పడం 'కల్కి 2898' ఆగమనం గురించే అని అర్థమవుతుంది. చివరగా కమల్‌హాసన్ వింతరూపంలో కనిపించి 'భయపడకు.. మరోప్రపంచం వస్తుంది..' అంటూ షాక్ ఇచ్చారు. 'అశ్వత్థామ పోరాటాలు, 'కల్కి' సాహసాలు.. హాలీవుడ్‌ను తలదన్నే అద్భుతమైన సాంకేతికత.. ఇవన్నీ 'కల్కి 2898' ట్రైలర్‌లో కనిపించాయి. దిషాపటానీ, రాజేంద్రప్రసాద్.. ఇంకా చాలామంది ఈ ట్రైలర్‌లో కనిపించారు. వైజయంతీమూవీస్ చరిత్రలోనే అత్యంత భారీగా రూపొందిన ఈ పాన్ ఇండియా సినిమా ఈ నెల 27న విడుదల కానుంది.

## పాటల పర్వంలో 'సరిపోదా శనివారం'

*నాని కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఆగస్ట్ 29న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌ను మొదలుపెట్టారు. ఈ చిత్రం ఫస్ట్‌సింగిల్‌ను ఈ నెల 15న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. కథానుగుణంగా జేమ్స్ బిజోయ్ మంచి సంగీతాన్నందించాడని దర్శకుడు పేర్కొన్నారు. 'ఈ సినిమాలో సూర్య పాత్రలో కనిపిస్తారు నాని. కోపాన్ని క్రమపద్ధతిలో వాడుకుంటూ శనివారాలను మాత్రమే ముహూర్తాలుగా ఎంచుకొని శత్రువులను వేటాడే వ్యక్తిగా ఆయన కొత్త పంథాలో కనిపిస్తారు' అని చిత్ర బృందం పేర్కొంది. ప్రియాంక అరుళ్ మోహన్, ఎస్‌జే సూర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మురళి.జి, సంగీతం: జేక్స్ బిజోయ్, రచన-దర్శకత్వం: వివేక్ ఆత్రేయ.*





## కొత్త ఎన్టీఆర్‌ని పరిచయం చేస్తున్నా!

'కొత్తవాళ్లను వెండితెరకు పరిచయం చేయడంలో నాకు మంచి పేరుంది. అందులో నాకు సంతృప్తి కూడా ఉంది. అందుకే విరామం తర్వాత మేం చేస్తున్న చిత్రాన్ని కొత్తవాళ్లతో చేయాలనుకున్నాం. అందులో భాగంగానే 'న్యూ టాలెంట్ రోర్స్' అనే బ్యానర్‌ని స్థాపించాం. ఈ సంస్థకు నిర్మాతగా నా భార్య యలమంచిలి గీత వ్యవహరిస్తారు. మేం నిర్మించనున్న సినిమాకు సంబంధించి న్యూ టాలెంట్‌కోసం వెతుకుతున్నప్పుడు టి.ప్రసన్నకుమార్‌గారు ఓ కుర్రాడ్ని చూపించారు. తనెవరోకాదు, స్వర్గీయ నందమూరి తారకరామారావుగారి ముని మనవడు, స్వర్గీయ నందమూరి హరికృష్ణగారి మనవడు.. స్వర్గీయ నందమూరి జానకిరామ్‌గారి తనయుడు 'నందమూరి తారకరామారావు' అని తెలిపారు దర్శకనిర్మాత వైవీఎస్ చౌదరి. తన తాజా ప్రాజెక్ట్ గురించి వివరిస్తూ సోమవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారాయన. ఇంకా మాట్లాడుతూ 'తనకు కొడుకు పుట్టినప్పుడే ఓ కల కని ఎన్టీఆర్ అనే పేరును కొడుక్కి పెట్టుకున్నారు జానకిరామ్. దానికి తగ్గట్టే ఆ కుర్రాడు కూడా అందగాడు, చక్కని వాచకం, మంచి నడవడిక. తండ్రి కల సాకారం చేయాలనే తపన కూడా అతనిలో ఉంది. అతడ్ని చూసినప్పుడు అన్నగారి నాలుగో తరాన్ని కొనసాగించే కెపాసిటీ అతనికి ఉందని అనిపించింది. ఏదేమైనా అన్నగారి నాలుగోతరాన్ని తెరకు పరిచయం చేసే భాగ్యం నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. మరో సమావేశంలో అతని రూపాన్ని రివీల్ చేస్తాం. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని తెలిపారు వైవీఎస్. ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేశ్ అత్తిలి.

## ఫ్యామిలీ ఎమోషన్స్‌తో 'మహారాజ'




విజయ్ సేతుపతి నటిస్తున్న 50వ చిత్రం 'మహారాజ'. నితిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సుధన్ సుందరం, జగదీష్ పళనిసామి నిర్మించారు. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో నటించాడు. ఈ చిత్రాన్ని ఈ నెల 14న ఎన్వీఆర్ సినిమాస్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయబోతున్నది. సోమవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ సేతుపతి మాట్లాడుతూ 'నా కెరీర్‌లో ఈ సినిమాకు ఎంతో ప్రత్యేకత ఉంది. చూసినవారందరూ బాగుందని మెచ్చుకున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా అందరికీ నచ్చుతుంది. విజయంపై కాన్ఫిడెంట్‌గా ఉన్నాం' అన్నారు. విజయ్ సేతుపతికి తాను పెద్ద ఫ్యాన్‌నని, ఆయనతో వర్క్ చేయడం ఆనందంగా ఉందని కథానాయిక మమతా మోహన్‌దాస్ పేర్కొంది. మాస్ అంశాలతో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న చిత్రమిదని నిర్మాత ఎన్వీ ప్రసాద్ తెలిపారు. భారతీయరాజా, అభిరామి, సింగం పులి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, రచన-దర్శకత్వం: నితిలన్ స్వామినాథన్.



## 'యుఫోరియా'కు స్వరాలు

'యుఫోరియా' పేరుతో దర్శకుడు గుణశేఖర్ ఓ చిత్రాన్ని రూపొందించబోతున్న విషయం తెలిసిందే. త్వరలో షూటింగ్ ప్రారంభం కానుంది. యూత్‌ఫుల్ సోషల్‌డ్రామాగా వినూత్న కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా కాలభైరవను ఖరారు చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఓ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. కథానుగుణంగా సంగీతానికి ప్రాధాన్యత ఉన్న కథాంశమిదని, కాలభైరవ మ్యూజిక్ ప్రత్యేకాకర్షణగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.



## కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా

సుమన్‌తేజ్, గరీమ చౌహాన్ జంటగా నటించిన చిత్రం 'సీతా కల్యాణ వైభోగమే'. సతీష్ పరమవేద దర్శకత్వంలో రాచాలా యుగంధర్ నిర్మించారు. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ఈ సినిమా ట్రైలర్‌ను యువ నిర్మాత హర్షిత్ రెడ్డి విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కుటుంబ సమేతంగా చూసి ఆనందించే చిత్రమిది. శ్రీరాముడు తన ఆదర్శ జీవితంతో అందరికి గుర్తుండిపోయాడు. అలాంటి లక్షణాలున్న ఓ యువకుడి కథ ఇది. తప్పకుండా అందరినీ ఆకట్టుకుంటుంది' అన్నారు. కథానుగుణంగా చరణ్‌అర్జున్ మంచి సంగీతాన్నందించాడని, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఆకట్టుకుంటుందని నిర్మాత రాచాల యుగంధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.